క్లుప్తంగా

సీసీరోడ్డు పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ సుల్తాన్‌పూర్ టౌన్‌షిప్ కాలనీ, 14వ డివిజన్‌లోని ఏఎస్‌ఆర్ టౌన్‌షిప్ కాలనీల్లో బుధవారం మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీఈఈలు జ్యోతిరెడ్డి, నర్సింహారాజు, ఏఈ వినీల్‌గౌడ్, కార్పొరేటర్ నేనావత్ బాలునాయక్, నాయకులు మార్కెట్ కమిటీ మాజీ సభ్యులు బొర్ర జగన్‌రెడ్డి, జెనిగె శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారులు బుధవారం లెక్కించారు. 11 నెలలకు సంబంధించిన ఆదాయాన్ని మధ్యాహ్నం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ కుమార్, ఈఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించి రూ.1,60,042లుగా తేల్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

యాచారం: ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి మండల పరిధి పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. తక్కళ్లపల్లి కేంద్రం పరిశీలన అనంతరం అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. తదితర గ్రామాల నర్సరీలను సందర్శించారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

కడ్తాల్: పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్ కోరారు. బుధవారం మండల పరిధి గానుగుమార్లతండాలో బూత్ నంబర్ 162కు కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా నవీన్‌నాయక్, బూత్ సెక్రటరీగా వెంకటేశ్‌నాయక్, నంబర్ వన్ లాబార్థి ప్రముఖ్‌గా రాజేశ్‌నాయక్, మాన్‌కి బాత్ ప్రముఖ్‌గా జగన్‌నాయక్, వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్‌గా రాకేశ్‌నాయక్, మెంబర్ బీఎల్‌ఏ 2గా బి. పత్యానాయక్‌ను నియమించారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, సీనియర్ నాయకులు రాజునాయక్, మల్లేశ్‌నాయక్, మునేశ్‌నాయక్, జీవన్, రమేశ్, గోపి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7లక్షలతో సీసీరోడ్డు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి 7వ వార్డులో అంబికానగర్ కాలనీలో కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూ.7లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణలు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ రాజేందర్ ముదిరాజ్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ నుంచి గోవర్ధన్‌ను తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్: వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్‌ను వీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్‌ల నుంచి తొలగిస్తున్నామని సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమితి నిర్ణయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఆయనను.. గతంలో పలుమార్లు హెచ్చరించినప్పటికీ.. వ్యవహార శైలిలో మార్పు రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.



జాపాల ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనం.. బకాయిల భారం

ఆర్థిక ఇబ్బందుల్లో నిర్వాహకులు

- కార్మికులకు అందని వేతనాలు
- కష్టతరంగా మారిన పథకం

మంచాల: పిల్లలకు పోషకాహారం అందించడంతో పాటు.. పాఠశాల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యాహ్న భోజనం పథకం కష్టతరంగా మారింది. బిల్లులు చెల్లించడంలో సర్కారు జాప్యం వలన నిర్వాహకులు చేతులు ఎత్తేస్తున్నారు. తమ వల్లకావడం లేదని పేర్కొంటున్నారు. రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయని, అప్పుచేసి పిల్లలకు భోజనం వడ్డిస్తున్నామని వెల్లడిస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అందని వేతనాలు

35 పాఠశాలల్లో 79 మంది కార్మికులు పని చేస్తున్నారు. వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1 వెయ్యి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2వేల చొప్పున ప్రతి నెల ఒక్కరికి రూ.3 వేల జీతం చెల్లించాలి. కానీ కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించి రూ.2,లక్షల 37వేలు, రాష్ట్ర ప్రభుత్వం జూలై నుంచి నవంబర్ వరకు ఐదు నెలలకు సంబంధించి రూ.7లక్షల 90వేలు బకాయి పడింది.

పెండింగ్ రూ.23.38 లక్షలు

భోజనం పథకం నిర్వహణలో.. నెలకు 24 రోజుల పాటు పాఠశాల కొనసాగితే.. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.1లక్ష 20వేలు, 6,7,8 తరగతుల వారికి రూ.1లక్ష 10వేలు, 9,10 తరగతుల బాలబాలికలకు రూ.1లక్షల 07 వేల చొప్పున ఖర్చు అవుతుంది. ఈ నేపథ్యంలో గడిచిన మూడు నెలలుగా బిల్లులు ఆగిపోవడంతో రూ.10లక్షల 11వేలు బకాయి పేరుకుపోయింది. కోడి గుడ్ల బిల్లులు ఆరు నెలలకు సంబంధించి మరో రూ.3లక్షలు బకాయి ఉంది. ఇలా మండల పరిధిలో మొత్తం రూ.23లక్షల 38 వేలకు పైగా పథకం బిల్లులు ఆగిపోయాయి. ఇదే విషయమై ఎంఈఓ రాందాస్‌ను వివరణ కోరగా.. కొంత వరకు బిల్లులు వచ్చాయని, ఇంకా రావాల్సి ఉందని పేర్కొన్నారు.

పాఠశాలలు.. విద్యార్థులు

మంచాల మండల పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 17, ప్రాథమికోన్నత 7, ఉన్నత 10, ఆదర్శ బడి 1 చొప్పున మొత్తం 35 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 1052 మంది, 6నుంచి 8వ తరగతి వరకు 936 మంది, 9 నుంచి 10 వరకు 702 మంది మొత్తం 2,690 మంది బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు.

తరగతుల వారీగా బిల్లు

ప్రభుత్వ లెక్కల ప్రకారం 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.5.45 పైసలు, 5 నుంచి 8వ తరగతి వరకు రూ.8.17పైసలు, 9వ నుంచి 10వ తరగతి వరకు రూ.10-67 పైసలు ఇవ్వాలి. 1 నుంచి 8వ తరగతి చిన్నారులకు గుడ్లు ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి అదనంగా బిల్లు చెల్లించాలి.

సకాలంలో ఇవ్వాలి



మిడ్ డే మీల్స్ స్కీమ్ బిల్లులు సకాలంలో చెల్లించాలి. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 ఉంది. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచాలి. కార్మికులకు ఇచ్చే వేతనాలు నెలవారీగా అందించాలి.

– నోముల పద్మమ్మ, వంట కార్మికురాలు, జాపాల

అప్పు చేస్తున్నాం..



అప్పు చేసి పిల్లలకు భోజనం వడ్డిస్తున్నాం. పెండింగ్ బిల్లులతో పాటు.. ఇక మీదట ఏ నెల డబ్బులు ఆ నెలకు ఇవ్వండి. బిల్లు చెల్లింపులో జాప్యం సరికాదు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలి.

– అలివేలు, వంట కార్మికురాలు, చిత్తాపూర్

పట్టుదలకు ప్రతిఫలం

గ్రూప్‌–4లో ఉద్యోగం సాధించిన స్వప్న



మహేశ్వరం: ఉన్నత విద్యనభ్యసించినా ఇంటికే పరిమితమైన ఆమె.. కట్టుకున్న వాడి ప్రోద్బలంతో ఉన్నత ఉద్యోగం సాధించింది. కుటుంబ భారాన్ని మోస్తూనే.. 'స్వప్న'ం నెరవేర్చుకుంది. పట్టుదల క్రమశిక్షణతో ముందుకు సాగితే సాధించలేనిదంటూ లేదని నిరూపించింది. మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన గుర్రంపల్లి స్వప్న గ్రూప్‌–4 పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, అత్యుత్తమ ఫలితాలు సాధించి, వార్డు ఆఫీసర్ కొలువును సంపాదించింది. ఈ మేరకు బుధవారం ఆమె పెద్దపల్లిలో యువవికాసం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చేతుగా మీదుగా నియామకపత్రం అందుకున్నారు. భర్త నవీన్.. గంగారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తుండగా, భార్య స్వప్న వార్డు ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడంతో కుటుంబీకులు, సన్నిహితులు, గ్రామస్తులు వారికి అభినందనలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



కల్వర్టును పరిశీలిస్తున్న కేఎల్లార్ తదితరులు

మహేశ్వరం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కల్వకోల్‌–అమీర్‌పేట్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వంలో లంచాలు, కమీషన్లు ఉండవన్నారు. కల్వకోల్‌–అమీర్‌పేట్ బీటీరోడ్డు నిర్మాణానికి రూ.8కోట్ల నిధులు మంజూరయ్యాయని, నాణ్యతతో కూడిన మెటీరియల్‌తో రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్మాణదారులకు సూచించారు. కల్వర్టుల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి బీటీరోడ్డు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు చెప్పారు. కల్వకోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సాయిని గోపాల్‌రెడ్డి తండ్రి భీమ్‌రెడ్డి మరణించడంతో ఆయన దశదినకర్మ కార్యక్రమంలో కేఎల్లార్ పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రవాపు ఇజ్రాయేల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యాచారం జంగయ్య, వత్తుల రఘుపతి, కృష్ణనాయక్, చాకలి యాదయ్య, కూన యాదయ్య, లక్ష్మీనారాయణగౌడ్, ఆవుల యాదయ్య, రాఘవేందర్‌రెడ్డి, మంత్రి బాల్‌రాజ్, ఎర్ర చంద్రమోహన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కల పెంపకం, జంతువుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు రేంజ్ అధికారి

మంఖాల్ ఫారెస్టు రేంజ్ అధికారి ప్రభాకర్

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలని మంఖాల్ ఫారెస్టు రేంజ్ అధికారి ప్రభాకర్ అన్నారు. బుధవారం మహేశ్వరం గేటు వద్ద ఫారెస్టు కార్యాలయంలో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా వనదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కల పెంపకం, వాటి ప్రాధాన్యత, వన్యప్రాణుల సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. అడవుల్లో ఉండే వన్యప్రాణులను సంరక్షించాలన్నారు. అంతకుముందు మహేశ్వరం గేటు వద్ద ఉన్న మహాత్మాగాంధీ బాపూజీ పూలే రెసిడెన్షియల్ విద్యార్థులకు మొక్కల పెంపకం, వన్యప్రాణుల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మంఖాల్ ఫారెస్టు రేంజ్ ఉపఅటవీ క్షేత్ర అధికారి రాజేందర్‌రెడ్డి, సెక్షన్ అధికారులు జర్నప్ప, సరిత, బీట్ అధికారులు సూర్యప్రకాశ్, రవీందర్‌చారి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు మాధవీలత, అమర్‌నాథ్, సునీత, సత్యనారాయణ, రవికుమార్, యుగంధర్ ఉన్నారు.



సర్దార్‌నగర్‌లో వీధులను శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్ హేమలత, కమిషనర్ వాణి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుక్కుగూడ పురపాలక సంఘం చైర్‌పర్సన్ బరిగెల హేమలత సూచించారు. బుధవారం పుర పరిధిలోని 11వ వార్డు సర్దార్‌నగర్‌లో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 9 వరకు ప్రజా విజయోత్సవాలను మున్సిపాలిటీ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు రెడ్డిగళ్ల సుమన్, ఆర్.రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గురువారం పర్యటించనున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పండుగుల జయశ్రీ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు పెద్దఅంబర్‌పేట, కుంట్లూర్, పసుమాముల పరిధి వార్డుల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేయనున్నారని వెల్లడించారు. ఎమ్మెల్యే పర్యటనను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కొలువుదీరిన నూతన పాలకవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్‌పర్సన్ గీత

- అట్టహాసంగా మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం
- పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. మార్కెట్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను ప్రభుత్వం ఇటీవల నియమించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏడీఏ ఆదిలక్ష్మి చేత నూతన సభ్యులను మార్కెటింగ్ జిల్లా అధికారి రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన సభ్యులు వీరే..

చైర్ పర్సన్‌గా యాట గీత, వైస్ చైర్మన్‌గా గూడురి భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లుగా రమేశ్‌గౌడ్, నరేశ్‌నాయక్, జంగయ్య, యాదయ్య, సంపత్‌కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, మహ్మద్ అజీం, వస్పుల శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, కండె పాండురంగయ్య, గట్ల కేశవరెడ్డిలు తదితరులు ఉన్నారు. అనంతరం చైర్‌పర్సన్‌గా గీత మార్కెట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించగా.. ఎమ్మెల్యే కసిరెడ్డి స్వయంగా ట్రాక్టర్ నడిపించారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, పీసీబీ సభ్యులు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు కిషన్‌రెడ్డి, జగన్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో హోమం

ఆమనగల్లు: కార్తీకమాసం ముగింపు సందర్భంగా పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో బుధవారం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రామదూత ఆశ్రమం వ్యవస్థాపకుడు శివానంద స్వామి, ఆలయ అర్చకులు రామకృష్ణ శర్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు సత్యనారాయణ, దామోదరాచారి, బుచ్చిరాములు, జంగయ్య, కృష్ణయ్య, భాస్కర్, దశరథం, నాగభూషణం, మాధవాచారి, ఆంజనేయులు, కృష్ణయ్య, లక్ష్మయ్య, చక్రపాణి, రఘు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు తీయిస్తున్న సీఎం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- డ్వాక్రా సంఘాలకు రూ.కోటి చెక్కు అందజేత



ఇబ్రహీంపట్నం: మహిళా సంఘాలకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రతి మహిళను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రజాభవన్‌లో బుధవారం మున్సిపాలిటీ ఎస్‌హెచ్‌జీ డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.కోటి రుణం, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాలకు సంబంధించిన సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.1.13కోట్ల విలువగల చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను లక్షాధికారిగా చేసేందుకు అనేక ఉపాధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గడిచిన ఏడాది కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 977 మంది లబ్ధిదారులకు రూ.9 కోట్ల 77 లక్షల, 80 వేలు అందజేశామని, సీఎం సహాయనిధి కింద పేదవాడి వైద్య ఖర్చుల నిమిత్తం 892 మందికి రూ.6 కోట్ల 78 లక్షల 500ల విలువగల చెక్కులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుతో పాటు.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరుగులు తీయిస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ బర్ల మంగయాదవ్, కమిషనర్ రవీంద్రసాగర్, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, అధికారులు, కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

యాచారం: పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. పట్నం ప్రజాభవన్‌లో కుర్మిద్ద, మాల్, గునుగల్, యాచారం తదితర గ్రామాలకు చెందిన 25 మందికి రూ.10 లక్షల విలువ చేసే చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు మురళీ, రాజశేఖర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

తలకొండపల్లి: నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాసు శ్రీనివాసురెడ్డి అన్నారు. మండల పరిధి రామాకృష్ణాపురం గ్రామానికి చెందిన ఎలమందా రెడ్డి ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆయనకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.32 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు బుధవారం శ్రీనివాసురెడ్డి ఎలమందా రెడ్డికి చెక్కు అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఆమనగల్లు: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండె సాయి.. బుధవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు నేతలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించ తలపెట్టిన సమీకృత పండ్ల మార్కెట్ త్వరలోనే అందుబాటులోకి రానుందని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తెలిపారు. రూ.2వేల కోట్లతో 250 ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ బహిరంగ సభలో మరోసారి మార్కెట్ ప్రస్తావన తెస్తూ.. త్వరితంగా నిర్మిస్తామని సీఎం పేర్కొనడంతో వ్యాపారులు, మార్కెట్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ చిత్రపటానికి పాలకవర్గం, అధికారులు, రైతులు, వ్యాపారులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ నిర్మాణంతో ప్రజలు, రైతులు, వర్తకులు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర చారి, డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, అంజయ్య, లక్ష్మి, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, గణేశ్ నాయక్, నరసింహ, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.